ఆలయాలను అభివృద్ధి చేసుకుందాం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ సహకారంతో జిల్లాలో, నెల్లూరు నగరంలో ఆలయాలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా తొలి విడతగా విడుదలైన రూ.98.85 లక్షలతో అమ్మవారి ప్రాకార మహామండపం, దేవస్థానం చుట్టుపక్కల ఫ్లోరింగ్, ప్రధాన ముఖద్వారం పునర్నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు సోమవారం ఎంపీ ఆదాల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ పూర్వపు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సహకారంతో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు, సభ్యుల కృషితో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా తొలి విడతగా రూ.98.85 లక్షలు విడుదలయ్యాయని తెలిపారు. దేవస్థానం అభివృద్ధి కోసం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.2.50 కోట్ల ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం 174 అంకణాల స్థలాన్ని గుడి పక్కనే సేకరించామని తెలిపారు. ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి టీటీడీ పూర్వపు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మేయర్ పొట్లూరు స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర అధ్యక్షుడు పెంచలరెడ్డి, స్థానిక కార్పొరేటర్ కె.విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.గౌరీరెడ్డి, దాసరి అమృత, పిండి సురేష్, ఎం.విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): భారతీయ రిజర్వు బ్యాంక్, కెనరా బ్యాంక్ ద్వారా ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్లను నగరంలోని కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా పొదలకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు, వేగూరు జెడ్పీ హైస్కూల్‌లో క్విజ్ పోటీలు, డీకేడబ్ల్యూ కళాశాలలో క్రాస్‌వర్డ్ ఫజిల్ పోటీలు నిర్వహించనున్నారు. మార్చి 1వ తేదీ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

ఏకగ్రీవంగా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎంపిక



ఏకగ్రీవంగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న డీటీసీ చందర్

నెల్లూరు(టౌన్): రాష్ట్ర రవాణాశాఖ సాంకేతిక అధికారుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నెల్లూరు ఏఎంవీఐ వైవీ పూర్ణచందర్‌రావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర రవాణాశాఖ సాంకేతిక అధికారుల సమావేశంలో ఈ అసోసియేషన్‌కు జిల్లా నుంచి పలువురు అధికారులు ఎంపికయ్యారు. సలహాదారులుగా కందుకూరు ఎంవీఐ షేక్ మహమ్మద్‌రఫీ, మూడో జోన్ సెక్రటరీగా ఏఎంవీఐ కార్తీక్ పవన్‌కుమార్, జిల్లా ప్రతినిధిగా ఏఎంవీఐ రఘువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వీరిని డీటీసీ చందర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరు ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, కావలి ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి, ఎంవీఐ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో యువత చేరిక



నెల్లూరు(మినిబైపాస్): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నగరంలోని కుక్కలగుంట, రాజేంద్రనగర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. వారికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, జగదీష్‌సింగ్, బాబు, శ్రీను, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): ఏడేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో షేక్ మస్తాన్ అనే వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మస్తాన్ కొడవలూరు మండలం దర్గా సంఘం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతను 2019 మార్చి 20వ తేదీన స్కూల్‌కు వెళ్తున్న ఏడేళ్ల బాలికను పూరిగుడిసెలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక ఏడుస్తుండగా తల్లి విషయం తెలుసుకుని ఆదేరోజు కొడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మస్తాన్‌పై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజారెడ్డి కేసు వాదించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

• ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ జగనన్న ఆశయాలను ముందుకు తీసుకెళతానని నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. నగరంలోని 5వ డివిజన్ సత్యనారాయణపురం, 49వ డివిజన్ ఈద్గామిట్ట తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సహకారంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు నగర నియోజకవర్గంలో ఒక సామాన్యుడికి అవకాశం ఇచ్చారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు చెబుతుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నెల్లూరు నగరాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రూ.1,200 కోట్లతో అభివృద్ధి చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, వందవాశి రాజేశ్వరి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఖలీల్ అహ్మద్

గొల్లకందుకూరులో వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరురూరల్: మండలంలోని గొల్లకందుకూరు గ్రామంలో ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచరులు, స్థానిక టీడీపీ నాయకులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. బోగోలు సుధాకర్‌రెడ్డి, రామిరెడ్డి, సందీప్‌రెడ్డి, వారి మిత్ర బృందం పార్టీలో చేరారు. వీరికి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, నాయకులు శివసునీల్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, హరిబాబుయాదవ్, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఆదాలను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

నెల్లూరు(బారకాసు): నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డివిజన్ ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రావు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కోరారు. సోమవారం వారు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 20వ డివిజన్‌లో ఇంటింటికీ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. స్నేహానగరంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పద్మజాయాదవ్, రమాదేవి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌యాదవ్, సరేష‌రెడ్డి, ప్రకాష్, శైలజమ్మ, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పోతురాజుశేఖర్, మురళి, రమణయ్య, నిర్మలనాయుడు, రాజేశ్వరి, దుర్గమ్మ, ప్రసనమ్మ, ఉషమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్నేహానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నెల్లూరు రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సీఐ మారుతీకృష్ణ

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ సీఐగా కె.మారుతీకృష్ణ సోమవారం నగరంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా ఉన్న సుబ్బారావును వీఆర్‌కు బదిలీ చేశారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు తనవంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు అందజేసేందుకు క్యూలో ఉన్న అభ్యర్థులు

నెల్లూరు(బారకాసు): ఆర్‌అండ్‌బీ అతిథి గృహాల్లో అటెండర్, వాచ్‌మెన్, స్వీపర్‌గా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 823 దరఖాస్తులు అందాయని సమాచారం. దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం చివరి రోజు కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన దరఖాస్తుదారులతో నగరంలోని ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయం కిక్కిరిసింది. ఒక్కొక్క అతిథి గృహానికి ముగ్గురు చొప్పున జిల్లావ్యాప్తంగా 9 అతిథి గృహాల్లో 27 మందిని మెరిట్ ప్రకారం ఎంపిక చేయనున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ

నెల్లూరు(దర్గామిట్ట): ప్రకృతి వ్యవసాయాన్ని పోత్సహించేలా కలెక్టర్ ఎం.హరినారాయణన్ కలెక్టరేట్ ప్రాంగణం వద్ద ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం సత్ఫలితాలనిస్తోంది. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం వెలుపల 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరల విక్రయాన్ని ఏర్పాటు చేశారు. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు క్యూకట్టారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాన్ని ప్రారంభించిన గంటలోపే అన్నీ అమ్ముడుపోయాయి.



ఆకుకూరలు, కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి



అర్జీని పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

• అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): స్పందనలో అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువు లోపు పరిష్కరించేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు. కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాల మేరకు సోమవారం నెల్లూరులోని నగరపాలక సంస్థలో ఉన్న ఏపీజే డాక్టర్ అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులందరూ విధిగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్సుమెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం అర్జీదారునికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 21 ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి 2, ఇంజినీరింగ్ విభాగానికి 6, పట్టణ ప్రణాళికా విభాగానికి 4, హౌసింగ్ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 2, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ విభాగాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణ కవచ అలంకార ఉత్సవం



సిద్ధి విఘ్నేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పప్పులవీధిలో ఉన్న శ్రీసిద్ధి విఘ్నేశ్వరాలయంలో స్వామివారికి స్వర్ణ కవచ అలంకరణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహాకుంభాభిషేకం, స్వర్ణకవచానికి కుంభప్రోక్షణ, మంగళహారతి పూజలు చేశారు. సాయంత్రం పప్పులవీధిలోని శ్రీపాండురంగ అన్నదాన సమాజం వద్ద నుంచి సిద్ధి విఘ్నేశ్వరాలయానికి స్వామివారి స్వర్ణకవచాన్ని శోభాయాత్రగా తీసుకువచ్చారు. స్వామివారికి స్వర్ణకవచ అలంకరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత సిద్ధి విఘ్నేశ్వరస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. 1,008 కిలోల సుగంధభరిత పుష్పాలతో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీపాండురంగ అన్నదాన సమాజ కమిటీ సభ్యులు, శ్రీసిద్ధి విఘ్నేశ్వరాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డివైడర్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి డివైడర్ల మధ్యలో ఫ్లెక్సీలు, ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమణబాబు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

రౌడీషీటర్ వీరంగం



ఘటనా స్థలంలో రక్తస్రావంతో సురేష్

• కత్తులతో ఓ వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఓ రౌడీషీటర్ తన అనుచరులతో కలిసి వీరంగం చేశాడు. స్కూటీపై మితిమీరిన వేగంతో ముందు వెళుతున్న వారిని ఢీకొట్టాడు. వారిని వెంబడించిన ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి అతని బైక్, సెల్‌ఫోన్ తదితరాలను దోచుకుని ఉడాయించాడు. వివరాల్లోకి వెళ్లితే.. నగరంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఓ రౌడీషీటర్ సోమవారం సాయంత్రం మరో నలుగురు యువకులతో కలిసి స్కూటీపై మినీబైపాస్ మీదుగా నగరంలోకి బయలుదేరాడు. మితిమీరిన వేగంతో అన్నమయ్య సర్కిల్ సమీపంలో మఫ్టీలో వెళుతున్న నార్త్ ట్రాఫిక్ కానిస్టేబుల్ అనిల్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో కానిస్టేబుల్ అనిల్ వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. నిందితులు పరారవుతుండగా అతను సైరన్ వేసుకుంటూ వెంబడించారు. ఈ విషయాన్ని గమనించిన సత్యనారాయణపురానికి చెందిన సురేష్ సైతం నిందితులను వెంబడించారు. వారు మిలీనియం సబ్‌స్టేషన్ సమీపంలో యూటర్న్ తీసుకుని రామలింగాపురం వైపు వెళ్లారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ బైక్ అదుపుతప్పి కింద ఆయన పడిపోయారు. అయితే సురేష్ మాత్రం వారిని వదల్లేదు. వారిని వెంబడిస్తుండగా శ్రీహరినగర్ వద్ద నిందితులు కత్తితో అతనిపై దాడి చేసి పరారయ్యారు. గాయాలపాలైనప్పటికీ సురేష్ వారిని వెంబడించారు. రైల్వే ట్రాక్ వద్ద స్కూటీ ఆగిపోవడంతో నిందితులు దానిని అక్కడే వదిలివేశారు. సురేష్‌పై దాడి చేసి అతని బైక్‌ను, సెల్‌ఫోన్ తదితరాలను బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. గాయాలపాలైన సురేష్ జయభారత్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న బాలాజీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్ అబ్దుల్‌అజీజ్‌గా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

ఇందుకూరుపేట: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు కిషోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు కోరారు. జగదేవిపేట పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 3,4,5 తేదీల్లో జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులు 120 మందిని గుర్తించామని తెలిపారు. వారికి పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు 29 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరు వలసవాసుల, హైరిస్క్ ఏరియాలను గుర్తించి ప్రత్యేకంగా చుక్కలు వేస్తున్నామని తెలిపారు. చిన్నారులందరికీ చుక్కలు వేసి నూరుశాతం లక్ష్యాన్ని సాధించేందుకు వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు రమ, సతీష్ బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోవూరు: మండలంలో మార్చి 3 నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్యారోగ్య సిబ్బంది విజయవంతం చేయాలని ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి నిరంజన్ కోరారు. ఇనమడుగు పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్యారోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు.

నారాయణలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న వైద్యులు

నెల్లూరు సిటీ: నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో 19వ గ్రాడ్యుయేషన్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 2018 బ్యాచ్ విద్యార్థులు ఐదేళ్లు ఎంతో కష్టపడి చదివి, ఉత్తీర్ణులై పట్టాలు పొందే కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌రెజినాల్డ్, న్యూరాలజిస్ట్ డాక్టర్ సంపత్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ విశ్వకుమార్ పాల్గొన్నారు.